క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనారాయణ హోమం


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక కన్యకాపరమేశ్వరదేవి ఆలయంలో బుధవారం లక్ష్మీనారాయణ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి విశేష పుష్పాకరణ గావించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేదపండితులు ఆధ్వర్యంలో లక్ష్మీనారాయణ హోమం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు గోపాజగదీష్, కార్యదర్శి కందూరి కృపాకర్, కోశాధికారి మేడా వెంకటేశ్వర్లు, సభ్యులు సత్యరంగయ్య, వెంకట్, రాజారమణ, శ్రీనాథ్, జగన్, చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

రేపు 'రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో'

తాడిపత్రిటౌన్: పట్టణంలోని పాత వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం రీకాలింగ్ చంద్రబాబూస్ మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి బుధవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్లమెంటరీ పరిశీలకులు నరేష్‌కుమార్‌రెడ్డి హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఉపాధ్యాయుల నిర్లక్ష్యమేమీ లేదు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మధ్య జరిగిన పెనుగులాటలో గాయపడిన రామన్న అనే విద్యార్థికి పీఈటీలే వైద్యం చేయించారని, ఉపాధ్యాయుల నిర్లక్ష్యమేమీ లేదని ఎంఈఓ సుబ్బరాయుడు, హెచ్‌ఎం మురళీకృష్ణ తెలిపారు. బుధవారం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడారు. బాలుర మధ్య జరిగిన గొడవకు పాఠశాల హెచ్‌ఎం, పీడీల నిర్లక్ష్యమే కారణమంటూ కానీ కొందరు సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టి పాఠశాల ప్రతిష్టను దెబ్బతీయడం బాధాకరమన్నారు. ఉపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, రంగస్వామి, పీడీలు వేణుగోపాల్, ఎంకె.రాజేష్, పాఠశాల కమిటీ ఛైర్మన్ షాషు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

యాడికి: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అందిన సమాచారం మేరకు మంగళవారం రాత్రి యాడికిలోని కోన రోడ్డులో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో డోన్ తాలూకా జలదుర్గం గ్రామానికి చెందిన మధు, డోన్ నివాసి బాలకృష్ణుడు ఆటోలో 18 ప్యాకెట్లలో తీసుకువచ్చిన 5.4 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని యాడికి నివాసి బలరాముడికి అందజేస్తుండగా పట్టుకున్నారు. ముగ్గురునీ అదుపులోకి తీసుకున్నారు. ఆటోను సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని గుంతకల్లులోని గోదాముకు తరలించినట్లు సీఎస్‌డీటీ మల్లేసు తెలిపారు. పట్టుబడిన ముగ్గురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మస్తానయ్య హుండీ ఆదాయం రూ.21.28 లక్షలు

గుంతకల్లు: పాత గుంతకల్లులోని మస్తానయ్య దర్గాలో బుధవారం హుండీ కానుకలను లెక్కించారు. కానుకల రూపంలో రూ.21.28 లక్షలు స్వామికి అందినట్లు వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ రెహమాన్ తెలిపారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది రూ.2 లక్షల మేర ఆదాయం పెరిగిందన్నారు. అలాగే దర్గా ప్రాంగణంలో జెయింట్ వీల్ (ఉయ్యాల) నిర్వహించిన టెండర్లలో రికార్డు స్థాయిలో రూ.24.09 లక్షలు పలికిందన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ ఆఫీసర్ రామసుబ్బారెడ్డి, టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్, దర్గా కమిటీ సభ్యులు, పాతగుంతకల్లు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన టీపీఆర్ అంత్యక్రియలు


టీపీఆర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

గుంతకల్లు: టీపీఆర్ ట్రస్ట్ అధినేత, లక్ష్మీనారాయణస్వామి ఆలయ నిర్మాణ కర్త తలారి పరశురాముడు అంత్యక్రియలు బుధవారం ముగిశాయి. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాదిలింగేశ్వరబాబు తదితరులు పరశురాముడు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కసాపురంలోని లక్ష్మీనారాయణస్వామి ఆలయ సమీపంలోనే ఖాళీ స్థలంలో పరశురాముడు భౌతికకాయాన్ని పూడ్చి పెట్టారు.


ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిరుపయోగంగా ఆర్‌ఓ ప్లాంట్

నిర్వహణ లోపం.. విద్యార్థులకు శాపం

గుంతకల్లుటౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో మనబడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా సమూల విద్యాసంస్కరణలు ఉద్యమంలా సాగాయి. అందులో భాగంగానే గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పాఠశాలల్లో విద్యార్థులకు శుద్ధమైన తాగునీటిని అందించేందుకు ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. అయితే సుమారు 850 మంది చదువుతున్న ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్ చిన్న చిన్న మరమ్మతులు, నిర్వహణాలోపం కారణంగా నిరూపయోగంగా మారింది. దీంతో విద్యార్థులకు శుద్ధమైన నీరు అందడం లేదు. కూటమి ప్రభుత్వం దీని గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. ఇప్పటికైనా ఆర్‌ఓ ప్లాంట్‌కు మరమ్మతులు చేయించి విద్యార్థులకు శుద్ధమైన తాగునీరు అందించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.


అధికారులు లేక ఖాళీగా ఉన్న కార్యాలయం

ఖాళీ కుర్చీల దర్శనం

గుత్తి రూరల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉండటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏఓను పోస్టు ఖాళీగా ఉంది. జూనియర్ అసిస్టెంట్ సెలవు పెట్టారు. అయితే సీనియర్ అసిస్టెంట్ రోజూ 11 గంటలకు పైనే కార్యాలయానికి వస్తున్నారు. అధికారులు ఆలస్యంగా రావడం, త్వరగా వెళ్లిపోవడం పరిపాటిగా మారిందని వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు విమర్శిస్తున్నారు. ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బంది కూడా వేళకు హాజరు కావడం లేదని కూలీలు వాపోతున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్‌ను వివరణ కోరగా ఆలస్యంగా వస్తున్న సిబ్బందిని ఇప్పటికే తీవ్రంగా మందలించామన్నారు. సీనియర్ అసిస్టెంట్ రోజు ఆలస్యంగా వస్తున్నారని, ఇకపై ఎవరైనా ఆలస్యంగా వస్తే జెడ్పీ సీఈఓకు రిపోర్ట్ పంపుతామన్నారు.


రక్షణ గోడలో తొలగించిన ఇనుప పైపులు

గోడకు 'రక్షణ' కరువు

గుంతకల్లు: కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆవాలయ ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన రక్షణ గోడకు రక్షణ కరువైంది. ఈ ముఖ ద్వారం నుంచి అర కి.మీ మేర తగ్గు ప్రాంతం ఉండటంతో వాహనాలు, ద్విచక్రవాహనాలకు రక్షణగా పైపులతో ఒక గోడను నిర్మించారు. అయితే ఈ గోడలో అమర్చిన ఇనుప పైప్‌లైన్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. దీంతో రక్షణ కోసం ఏర్పాటు చేసిన గోడకే రక్షణ కరువైందని భక్తులు పేర్కొంటున్నారు.

బదిలీ ఉపాధ్యాయురాలికి సన్మానం


యాడికిలో ఉపాధ్యాయురాలు ప్రతిభారాణిని సన్మానిస్తున్న దృశ్యం


గుత్తిలో ఉపాధ్యాయుడు మహబూబ్ బాషాను సన్మానిస్తున్న దృశ్యం

యాడికి: మండల కేంద్రంలోని నం:4 ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన ప్రతిభారాణిని బుధవారం పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం చంద్రశేఖర్, స్టాంప్ రైటర్ రజాక్ ఉపాధ్యాయురాలి సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులు రవీంద్ర, శైలజకుమారి, వరలక్ష్మి, పద్మావతి, రంగస్వామిరెడ్డి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని ఏపీటీఎఫ్ భవన్‌లో బుధవారం ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ గోరంట్లకు బదిలీ అయిన మహబూబ్ బాషాను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎంలు సుంకన్న, డేనియల్, దేశాయి నాగరాజు, ఉపాధ్యాయులు ఆదినారాయణ రెడ్డి, కిరణ్, హేమా వతి తదితరులు మహబూబ్ బాషాను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలి


పామిడిలో రిలేదీక్షలు చేస్తున్న దృశ్యం

పామిడి: ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. పామిడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఐక్యమాదిగ సమాజ్ ఆధ్వర్యంలో బుధవారం మూడోరోజుకు రిలేదీక్షలు కొనసాగాయి. ఐక్యమాదిగ సమాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంకరాజుకాలువ వెంకటేష్, తపాల లక్ష్మి, శంకర్, రాజ్‌కుమార్ దీక్షలో కూర్చుకున్నారు. ఈసందర్భంగా వంకరాజుకాలువ వెంకటేష్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం వెంటనే ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయాలన్నారు. ఈ దీక్షలకు అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు సుధీర్, కేశవ, శేఖర్, సూర్యనారాయణ సంఘీభావం తెలిపారు.

దుకాణాలపై మున్సిపల్ సిబ్బంది దాడులు


దుకాణంలో తనిఖీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలోని పలు దుకాణాల్లో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో హెల్త్ అసిస్టెంట్లు, సిబ్బంది బుధవారం విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 15 కిలోల నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ప్లాస్టిక్ విక్రయిస్తున్న దుకాణదారుల నుంచి జరిమానా వసూలు చేశారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా మాట్లాడుతూ ఇక నుంచి ఎవరైనా ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తే జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండల కేంద్రంలోని బుడగ జంగాల కాలనీకు చెందిన శ్రీనివాసులు (45) భార్య లక్ష్మీదేవితో కలిసి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. వీరికి నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆర్థిక సమస్యలతో భార్యాభర్తలు గొడవపడేవారు. ఈక్రమంలో తీవ్రమనస్థాపానికి గురైన శ్రీనివాసులు ఈనెల 10న ఇంట్లో ఎవరూ లేనిసమయంలో విషద్రావకం తాగాడు. కుటుంబ సభ్యులు అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..

బుక్కరాయసముద్రం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు..నంతపురం రూరల్ మండలం ఇటుకులపల్లి గ్రామానికి చెందిన లింగమయ్య(39) ఆటో డ్రైవర్‌గా పని చేసేవాడు. ఈ నెల 10వ తేదీన రెడ్డిపల్లి జిల్లా జైల్లో బంధులను చూడడానికి ఆటోలో భార్య లక్ష్మీదేవితో కలసి వెలుతుండగా సబ్‌స్టేషన్ ఎదుట పంది అడ్డురావడంతో ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో లక్ష్మీదేవికి స్వల్ప గాయాలు కాగా లింగమయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. బంధువులు అతడిని కర్నూలుకు తరలించారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య కొడుకు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో జలధి


పీర్ల వద్ద ప్రత్యేక పార్థనల్లో పాల్గొన్న రమేష్‌రెడ్డి

నార్పల: కేసేపల్లి గ్రామంలో బుధవారం పీర్ల జలధి కార్యక్రమం జరిగింది. తెల్లవారుజాము నుంచి పీర్లను గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఉదయం ఆరు గంటలకు పీర్లను అగ్నిగుండం ప్రవేశం చేయించారు. సాయంత్రం పీర్లను ఊరేగించిన అనంతరం జలధికి తరలించారు.

తాడిపత్రిటౌన్: పట్టణంలోని క్రిష్టాపురంలో పీర్లను కొలువుదీర్చారు. బుధవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి పీర్లను దర్శించుకుని ప్రార్థనలు చేశారు. పీర్ల పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు.

పెద్దపప్పూరు: చీమలవాగుపల్లిలో బుధవారం పీర్ల స్వాముల జలధి కార్యక్రమం నిర్వహించారు. ఉదయం గ్రామంలో పీర్లను ఊరేగించారు. సాయంత్రం పీర్లను జలధికి తరలించారు. ఈసందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైఎస్ జగన్‌ను కలిసిన డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: పట్టణానికి చెందిన డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి (రూపాయి డాక్టర్) బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా అధినేతతో తాడిపత్రి రాజకీయాలపై చర్చించినట్లు అనిల్ కుమార్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు, ప్రజలకు అండగా ఉంటూ పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారన్నారు.

వేరుశనగలో వేరుపురుగు నివారించుకోండి


ఇరువెందుల గ్రామంలో వేరుశనగ సాగుపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త జాహ్నవి

శింగనమల: వేరుశనగలో వేరుపురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, దీన్ని నివారించుకోవాలని రేకులకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త జాహ్నవి రైతులకు సూచించారు. బుధవారం ఇరువెందల గ్రామంలో వేరుశనగ పొలాలను పరిశీలించారు. వేరుశనగ పంటలో వేరుపురుగు ఉధృతి ఉందని, నివారణకు కార్బోఫురాన్ 3జీ గుళికలు ఎకరాకు 10 కేజీలు లేదా ఫిప్రోనిల్ 0.3 శాతం 10 కిలోలు చొప్పున మొక్కల మొదళ్ల దగ్గర గుంతలు చేసి వేయాలన్నారు. ఏఓ అన్వేష్‌కుమార్, రైతు సేవా కేంద్రం సిబ్బంది నాగేషు, రైతులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: విత్తన శుద్ధితో వేరుశనగలో తెగుళ్లు నివారించవచ్చని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి లక్ష్మీనరసింహ పేర్కొన్నారు. బుధవారం ఓబులాపురంలో వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వ్యవసాయాధికారి లక్ష్మీనరసింహ మాట్లాడుతూ వేరుశనగలో నూతన వంగడాలైన వశిష్ట, కదిరి లేపాక్షి సాగు లాభదాయకమన్నారు. వేరుశనగలో 8 గ్రాముల ట్రికోడెర్మాతో ఒక కేజీ విత్తనానికి పట్టించి విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. భూసార ఆధారిత ఎరువుల వాడకం చేపట్టడం వల్ల పెట్టుబడి తగ్గుతుందన్నారు. అనంతరం కంది, కొర్ర పంటలో సస్య రక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ హరి, శ్రీవాణి, ఎంపీఈఓ లలిత, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

దుండగులపై చర్యలు తీసుకోవాలి

గుంతకల్లు: కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పల హారికపై దాడి చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు పెద్దనేని రంగనాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో రెడ్ రాజ్యాంగం అమలులో ఉన్న శ్రద్ధ బీసీల పట్ల ఏమాత్రం లేదని ఆయన ఆరోపించారు. ఇందుకు బీసీ మహిళ హారికపై దాడే నిదర్శమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వానికి మహిళ పట్ల గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఇలాంటి దాడులు అరికట్టకపోతే రానున్న రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

గుత్తి ఆర్‌ఎస్‌లో చోరీ

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని ఆర్‌కే ఫంక్షన్ హాల్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. వివరాలు.. గుర్తు తెలియని వ్యక్తులు ఫంక్షన్ హాల్లోకి చొరబడి వాచ్‌మెన్ ఇంటిలో బీరువాలో దాచి ఉంచిన రూ.13 వేలు నగదుతో పాటు ఆరు తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. పోలీసులు ఘటన స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రామిరెడ్డి సేవలు చిరస్మరణీయం

పెద్దవడుగూరు : సీపీఐ నేత రామిరెడ్డి సేవలు చిరస్మరణీయమని ఆ పార్టీ మండల కార్యదర్శి వెంకట్రాముడుయాదవ్, సీనియర్ నాయకుడు నారాయణ పేర్కొన్నారు. బుధవారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో రామిరెడ్డి సంస్మరణ దినం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రామిరెడ్డి సేవలను కొనియాడారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు, కాశేపల్లి విరుపాక్షిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓలపై చర్యలు తీసుకోవాలి

గార్లదిన్నె: ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న ఎంఈఓలు తారా చంద్రనాయక్, వెంకటరమణనాయక్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం గార్లదిన్నె పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాయకులు హనుమంతు, ఆనంద్, మధు, ఓబిలేసు, నాగేంద్ర, శుభాష్, అశోక్, సూర్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఊళ్లకు వెళ్లేటప్పుడు సమాచారమందించండి

గుంతకల్లుటౌన్: ప్రజలు ఇళ్లకు తాళం వేసి ఊళ్లకు వెళ్లేటప్పుడు సమాచారాన్ని స్థానిక పోలీసులకు తెలియజేస్తే రాత్రి వేళ ఆయా ఏరియాల్లో పోలీస్ గస్తీని పెంచుతామని వన్‌టౌన్ సీఐ మనోహర్ తెలిపారు. బుధవారం ఆయన పుట్టపర్తి శివారుకాలనీల్లో దొంగల ముఠా రాడ్‌లను పట్టుకుని తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేస్తూ హల్‌చేసిన వీడియోలను ఆయన మీడియాకు రిలీజ్ చేశారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇళ్లల్లో చోరీలు జరగకుండా ఉండేందుకు అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

'నేతన్న నేస్తం ఏదీబాబు?'

పెద్దపప్పూరు: కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచినా నేత కార్మికులకు నేతన్న నేస్తం అమలు చేయలేదని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతా పురుషోత్తం మండిపడ్డారు. బుధవారం మండల కేంద్రంలో నేత కార్మికులతో ఆయన సమావేశం నిర్వహించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నేత కార్మికులు నేతన్న నేస్తం పథకం ద్వారా లబ్ధి పొందారన్నారు. కూటమి ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

రేపు విద్యుత్ అదాలత్

తాడిపత్రిటౌన్: మార్కెట్‌యార్డ్ సమీపంలోని విద్యుత్ డీఈఈ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీ ప్రభాకర్‌రావు తెలిపారు. తాడిపత్రి డివిజన్ పరిధిలోని వినియోగదారులు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని సూచించారు.

డ్రోన్లను సద్వినియోగం చేసుకోండి

పామిడి: ప్రభుత్వం సబ్సిడీతో అందజేస్తున్న అత్యాధునిక వ్యవసాయ డ్రోన్‌ను రైతన్నలు సద్వినియోగం చేసుకోవాలని గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సూచించారు. బుధవారం సొరకాయలపేట పొలాల్లో రైతుల సమక్షంలో ఆయన డ్రోన్‌ను లాంఛనంగా ప్రారంభించారు. రూ.10 లక్షలు విలువచేసే ఈడ్రోన్‌ను ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఓ విజయ్‌కుమార్, రైతులు, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

పామిడి: పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ నాయకులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, ఆ పార్టీ జిల్లా సమితి సభ్యులు కే రహీమ్ మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం గ్రామాల్లో పేదలకు మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వడంతోపాటు ఇంటిని నిర్మించి ఇవ్వాలన్నారు. ఇళ్ల స్థలాల కోసం ఇప్పటికే మూడుసార్లు అర్జీలు అందజేశామని తెలిపారు. అనంతరం తహసీల్దార్ షరిఫ్‌లకు వినతిపత్రం అందజేశారు. మండల కార్యదర్శి ఎస్ నాగరాజు నాయకులు, చౌడప్ప, ఇమామ్, ఆనంద్, మహిళలు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు పనిముట్ల పంపిణీ

పెద్దవడుగూరు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో బుధవారం ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, జౌళిశాఖ ఏడీ వరప్రసాద్ చేనేత కార్మికులకు పనిముట్లను పంపిణీ చేశారు. పరికరాలను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని కార్మికులకు సూచించారు. తహసీల్దార్ ఉషారాణి, ఎంపీడీఓ బారన్‌సాహెబ్, ఏపీడీ పుల్లారెడ్డి, ఏడీఓ మురళీమోహన్, డీఓలు బసవరాజు, కాంతారావు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌లపై క్రిమినల్ కేసు నమోదు చేస్తాం

తాడిపత్రి టౌన్: అవినీతికి పాల్పడిన ఉపాధిహమీ ఫీల్డ్ అసిస్టెంట్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు విజిలెన్స్ డీడీ శ్రీనివాసులు తెలిపారు. గత సామాజిక తనిఖీల్లో రికవరీ చూపని యాడికి, పెద్దపప్పూరు మండలాలకు చెందిన దాదాపు 50 మంది ఫీల్డ్ అసిస్టెంట్‌లతో తాడిపత్రిలోని ఏపీడీ కార్యాలయంలో బుధవారం ఆయన నేరుగా విచారణ చేపట్టారు. ఆయా మండలాల్లో వెలుగులోకి వచ్చిన అక్రమాలకు సంబంధించి దాదాపు రూ.2 కోట్లు రికవరీ చేయాల్సి ఉందన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు అక్రమాలకు పాల్పడుతున్నారని, అవినీతికి పాల్పడిన ఏ ఒక్క ఫీల్డ్ అసిస్టెంట్‌నూ వదలబోమన్నారు. సొమ్ము రికవరీ కాకపోతే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మున్సిపల్ కార్మికుల వినూత్న నిరసన


గుత్తిలో ఆకులు తింటూ నిరసన తెలియజేస్తున్న కార్మికులు

గుత్తి: తమ డిమాండ్ల సాధన కోసం మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులు గత నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం కార్మికులు ఆకులు తింటూ వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షులు రాజా, పారిశుద్ధ్య కార్మిక సంఘం అధ్యక్షులు సూరి, రామాంజనేయులు మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, జీఓ 36 ప్రకారం జీతాలు ఇవ్వాలన్నారు., ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు ఆది, మహేష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపులను నివారించండి


మాట్లాడుతున్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

గుత్తి: గ్రామాల్లో బెల్టు షాపులు, నాటుసారా, నకిలీ మద్యం, కల్తీ కల్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, ఏఈఎస్ శ్రీరామ్ స్థానిక ఎక్సైజ్ పోలీసు అధికారులను ఆదేశించారు. గుత్తిలోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌తో పాటు ఏ1 బార్ అండ్ రెస్టారెంట్‌ను బుధవారం వారు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం నమూనాలు సేకరించారు. పోలీసు స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నవోదయం 2.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. నాటుసారా తయారీ, క్రయ, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ఉమాదేవి, ఎస్ఐలు అస్లాం బేగ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మీడియేషన్‌పై 1కే ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న మెజిస్ట్రేట్ అనిల్‌కుమార్

తాడిపత్రి రూరల్: పట్టణంలోని కోర్టు ఆవరణ నుంచి బుధవారం మెజిస్ట్రేట్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో మీడియేషన్‌పై 1కే ర్యాలీ జరిగింది. హైకోర్టు ఆదేశాల మేరకు మీడియేషన్‌పై కక్షిదారుల్లో అవగాహన కల్పించడానికి 1కే ర్యాలీ చేశామని మెజిస్ట్రేట్ తెలిపారు. ర్యాలీలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజులరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు న్యాయవాదులు పాల్గొన్నారు.